సాక్షి
ఆదిలాబాద్
సోమవారం । 2 । డిసెంబర్ । 2024



పంటచేనులో సీసీ కెమెరా

8లో▸

తాంసి మండలం జామిడికి చెందిన రైతు చేనులోని సామగ్రి తరచూ చోరీకి గురవుతోంది. దీంతో అతడు వినూత్నంగా ఆలోచించి చేనులోనే సీసీ కెమెరా ఏర్పాటు చేశాడు.



అభివృద్ధికి దూరంగా గ్రామాలు

మారుమూల గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. దశాబ్దాలు గడుస్తున్నా ఆయా గ్రామాల ప్రజలు కనీస సౌకర్యాలకు నోచుకోలేకపోతున్నారు.

9లో▸

గరిష్టం/కనిష్టం
27.0/21.0

వాతావరణం

కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. చలి పెరుగుతుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

శభాష్.. లెక్కల సార్..



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న వంశీ

బోథ్: పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు వారి ఆకలి తీర్చారు. మండల కేంద్రానికి చెందిన డొంగరి వంశీ ఇటీవల డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం పొందారు. సొనాల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా చేరారు. పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ఆదివారం వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సమయంలో వారి ఆకలి గమనించి సొంత ఖర్చులతో భోజన ఏర్పాట్లు చేశారు. అనంతరం మళ్లీ ప్రత్యేక తరగతులు నిర్వహించి పాఠాలు బోధించారు. విద్యార్థులపై ఆయనకున్న మమకారాన్ని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని డీటీసీలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంప్–2 కొనసాగుతోంది. ఆదివారం కెడెట్లకు 'సైబర్ క్రైమ్ నేరాలు–అప్రమత్తత' అంశంపై అవగాహన కల్పించారు. అనామక స్పామ్ ఫోన్ కాల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, సైబర్ క్రైమ్‌పై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. 32 (టి) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ వికాస్‌శర్మ, సైబర్ క్రైమ్ ఇన్‌చార్జి సంతోష్, కెప్టెన్ జగ్‌రాం, లెఫ్టినెంట్ అశోక్, ఐలయ్య, ప్రశాంత్, సెకండ్ ఆఫీసర్ ఆనందరావు, ఎస్‌ఎం భగీరథ, సీనియర్ జేసీవో కవాజిత్ సింగ్, పీఐ స్టాఫ్ పాల్గొన్నారు.

మహిళలకు వంటల పోటీలు



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి

కైలాస్‌నగర్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గార్డెన్స్‌లో మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. పలువురు మహిళలు, యువతులు పాల్గొని తెలంగాణ రుచులు ఉట్టిపడేలా వివిధ వంటకాలు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ముగ్గురు విజేతలను ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు.

విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలి



మెనూ చార్ట్ పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌రూరల్: వసతిగృహాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దళిత అభివృద్ధి శాఖ బాలికల వసతిగృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, కిచెన్, సరుకులతో పాటు మెనూ చార్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కిచెన్ షెడ్‌తో పాటు గదుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అంతకుముందు ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా వసతిగృహంలో విద్యార్థినులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలను పరిశీలించారు. కలెక్టర్ వెంట పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.



ఆదిలాబాద్‌లో సమ్మె చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు (ఫైల్)

ఆర్టీసీపై ప్రైవేటు!

- పెరుగుతున్న అద్దె బస్సులు
- తగ్గుతున్న సొంత వాహనాలు
- ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్‌వే సగం
- ఆందోళనలో సంస్థ ఉద్యోగులు

ఉమ్మడి జిల్లాలోని బస్సుల సంఖ్య

సర్వీసులు	ఆర్టీసీ	ప్రైవేట్
రాజధాని	8	0
లహరి ఏసీ	12	0
లహరి నాన్‌ఏసీ	14	0
సూపర్ లగ్జరీ	82	0
డీలక్స్	1	0
సెమీ డీలక్స్	4	0
ఎక్స్‌ప్రెస్	36	72
పల్లె వెలుగు	140	223
మొత్తం	297	295

ఆదిలాబాద్: ప్రజా రవాణా వ్యవస్థలో 'ప్రైవేట్' అజమాయిషీ పెరుగుతోంది. టీజీఎస్ ఆర్టీసీలో సొంత బస్సుల కంటే ప్రైవేట్ హైర్ బస్సుల (పీహెచ్బీ) సంఖ్య పెరుగుతుండడం ఉద్యోగుల్లో ఆందోళనకు కారణమవుతోంది. మరోవైపు ప్రయాణికుల భద్రతపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీలో అద్దె బస్సులను ప్రవేశపెడతామని ప్రకటించడం గమనార్హం. ఇప్పటికే ప్రైవేట్ యజమానుల ఒత్తిళ్లు, డిమాండ్లకు సంస్థ తలొగ్గాల్సి వస్తోందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో మరిన్ని బస్సులు అద్దె ప్రాతిపదికన తీసుకుంటే ఆర్టీసీ ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తోందనే కలవరపాటు సంస్థ అధికారులు, కార్మికవర్గాల్లో వ్యక్తమవుతోంది.

ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకం

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల కన్నా ప్రజలు ఆర్టీసీనే ఎక్కువగా ఆదరిస్తారు. అయితే పలు సందర్భాల్లో ఆర్టీసీ బస్సులూ ప్రమాదాలకు గురవుతుండటం ప్రయాణికుల్లో గుబులు రేపుతోంది. ఆర్టీసీ సొంత డ్రైవర్ల కన్నా ప్రైవేట్ హైర్ బస్సులకు చెందిన డ్రైవర్లు కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు కారణం అవుతున్నారనే అభిప్రాయాలున్నాయి. హైర్ బస్సుల్లో ఆర్టీసీ కండక్టర్లను నియమిస్తుండగా, డ్రైవర్లను ప్రైవేట్ యజమానులే నియమించుకోవాల్సి ఉంటుంది. దీనిని ఆసరాగా చేసుకుని అద్దె బస్సుల యజమానులు తక్కువ జీతానికే అనుభవం తక్కువగా ఉన్న డ్రైవర్లను నియమించుకుంటున్నారనే విమర్శలున్నాయి. అనుభవం లేని డ్రైవర్ల కారణంగా ప్రమాదాలు జరిగిన సందర్భాలనేకం. ఈ ప్రమాదాల్లో అమాయకులు మరణిస్తుండగా ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కార్మికుల్లో కలవరపాటు

ప్రైవేట్ బస్సులు పెరుగుతుండటం, నూతన డ్రైవర్ల నియామకం లేకపోవడం ఆర్టీసీ కార్మికుల్లో ఆందోళనకు కారణమవుతోంది. సొంత బస్సులను సమకూర్చుకునే విషయంలో ఆర్టీసీ యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తుండటంతో ప్రైవేట్ బస్సుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందనే కలవరపాటు కార్మికులను తొలిచేస్తోంది. స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాల ద్వారా బస్సులను కొనుగోలు చేయించి, వాటిని హైర్ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ విధంగా ప్రైవేట్ బస్సుల సంఖ్య పెంచుతూ పోతే సంస్థ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని, ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడుతుందని కార్మిక సంఘాలు భావిస్తున్నాయి. మరోవైపు కార్మిక సంఘాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నాయి.

సగం అద్దె బస్సులే..

గతంలో తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన ఆర్టీసీ ప్రైవేట్ హైర్ బస్సుల వైపు మొగ్గు చూపింది. దీంతో యాజమాన్యంలోని సొంత బస్సుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. సొంత బస్సులను కొనలేని స్థితిలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేయడం ఆర్టీసీకి అనివార్యమైంది. దీంతో సంస్థపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలనే ఆలోచనలో భాగంగా అద్దె ప్రాతిపదికన బస్సులను సమకూర్చుకుంటోంది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో సగం బస్సులు ప్రైవేట్‌వే కావడం గమనార్హం. ముఖ్యంగా ప్రయాణికులు అధికంగా ప్రయాణించే ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో అద్దెకు తీసుకున్నవే అధికంగా ఉన్నాయి. ఇది టీజీఎస్ ఆర్టీసీపై ప్రైవేట్ బస్సుల ఆధిపత్యాన్ని స్పష్టం చేస్తోంది.

సమ్మె చేస్తే స్తంభించుడే..

అద్దె బస్సు యాజమాన్యాలు, డ్రైవర్లు పలు సందర్భాల్లో సమ్మెకు దిగితే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రయాణికులు ఎక్కువగా ప్రయాణించే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ప్రైవేట్ వాహనాలే అధికంగా ఉండగా ఎక్కడికక్కడ రాకపోకలు స్తంభిస్తున్నాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రవాణా చట్టాలకు వ్యతిరేకంగా ప్రైవేట్ పీహెచ్బీ డ్రైవర్లు సమ్మెకు దిగారు. దీంతో బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వారు ఏ కారణంతో సమ్మె చేసినా సంస్థకు ఆదాయం విషయంలో నష్టాలు తప్పడంలేదు. ముఖ్యంగా దసరా, సంక్రాంతి తదితర పండుగల సందర్భాల్లో వారు ఉద్యమిస్తే తప్పనిసరి పరిస్థితుల్లో వారి డిమాండ్లకు సంస్థ యాజమాన్యం దిగిరాక తప్పదనే చర్చ జోరుగా సాగుతోంది.

బెబ్బులి అలజడి!



ఇటిక్యాల పహాడ్ అటవీప్రాంతంలో పర్యటిస్తున్న అటవీశాఖ ఉన్నతాధికారులు

- ఇంకా 'ఇటిక్యాలపహాడ్‌'లోనే పులి
- ఆచూకీకి అటవీ సిబ్బంది గాలింపు
- పర్యవేక్షించిన పీసీసీఎఫ్
- తాజాగా పెంచికల్‌పేట్ మండలంలో పులిదాడిలో గేదె హతం
- పులుల సంచారంపై స్పష్టత కరువు

సిర్పూర్(టి): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పెద్దపులుల అలజడి కొనసాగుతోంది. కాగజ్‌నగర్, సిర్పూర్(టి) మండలాల్లో మనుషులపై దాడి చేసిన పులి ఇంకా జిల్లా సరిహద్దు దాటలేదు. ఇప్పటికీ అది సిర్పూర్(టి) మండలం ఇటిక్యాల పహాడ్ అటవీ ప్రాంతంలోనే సంచరిస్తోంది. మరోవైపు పెంచికల్‌పేట్ మండలంలోనూ పులి కదలికలు నమోదు కావడం కలకలం సృష్టిస్తోంది. దరోగపల్లి అటవీ ప్రాంతంలో ఓ పెద్దపులి గేదెను హతమార్చింది. అధికారులు పులిదాడిగా నిర్ధారించినా ఏ పులి అనే దానిపై స్పష్టతనివ్వలేదు. ఏ పులి.. ఏ ప్రాంతంలో తిరుగుతుందో సమాచారం తెలియకపోవడంతో రైతులు, అటవీ సమీప ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మహిళను చంపిన పులే సిర్పూర్(టి) మండలం దుబ్బగూడ గ్రామానికి చెందిన రైతుపై దాడి చేసినట్లు అటవీశాఖ అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఒకే పులి ఇద్దరిపై దాడి చేసిందని స్థానిక ఎఫ్ఆర్‌వో ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు. ఈ క్రమంలో సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని దుబ్బగూడ, నవేగాం, ఇటిక్యాల పహాడ్, హుడ్కిలి తదితర గ్రామాల ప్రజలు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. పత్తి సేకరణకు వెళ్లేందుకు జంకుతున్నారు.

ఇటిక్యాల పహాడ్ ప్రాంతంలోనే పులి..

దుబ్బగూడ గ్రామంలో రైతు సురేశ్‌పై దాడిచేసిన పులి ఇటిక్యాల పహాడ్ ప్రాంతంలోనే సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు. ఆదివారం పులి పాదముద్రలతోపాటు మూత్రం ఆనవాళ్లు, ఓ చెట్టుకు విసిరిన పంజాను సిబ్బంది గుర్తించారు. ఇటిక్యాల పహాడ్ నుంచి మాకిడి వెళ్లే ప్రాంతంలో ఒర్రె వద్దకు వెళ్లినట్లు పులి పాదముద్రలు ఉన్నప్పటికీ ఆ తర్వాత జాడ దొరకలేదు. దీంతో పులి ఎటు వైపు వెళ్లిందనే కోణంలో అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పులి జాడ కోసం డ్రోన్, సీసీ కెమెరాలను అమర్చి తీవ్రంగా గాలిస్తున్నారు. అయినా పులి జాడ దొరక్కపోవడంతో అధికారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ బెబ్బులి సరిహద్దు దాటి మహారాష్ట్ర వైపు వెళ్లకుండా, దారి మళ్లి సిర్పూర్(టి) రేంజ్ వైపు వస్తే ఏం చేయాలనే దానిపై కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడాలి

వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పీసీసీఎఫ్ అండ్ చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఏలుసింగ్ మేరు సూచించారు. సిర్పూర్(టి) మండలం ఇటిక్యాలపహాడ్ అటవీ ప్రాంతంలో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామస్తులకు ప్రత్యేక మాస్కులు పంపిణీ చేశారు. పులిదాడి నుంచి ఎలా తప్పించుకోవాలో వారికి వివరించారు. పులి ఎదురైతే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో చెబుతూ ధైర్యం నింపారు. ఎక్కడైనా పులి కదలికలుంటే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట సీసీఎఫ్ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, ఎఫ్ఆర్‌వో ఇక్బాల్ హుస్సేన్, ఎఫ్ఎస్‌వో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

మంచిర్యాలక్రైం: సిర్పూర్(టి) మండలం దుబ్బ గూడెంలో గతనెల 30న పెద్దపులి దాడిలో గాయపడిన రైతు సురేశ్‌ను ఆదుకుంటామని పీసీసీఎఫ్ ఏలుసింగ్ మేరు అన్నారు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని ఆదివారం పరామర్శించారు. వైద్యులను అడిగి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం కుటుంబ సభ్యులకు పండ్లు అందజేశారు. వైద్యఖర్చులు మొత్తం అటవీశాఖ భరిస్తుందని, ఆందోళన చెందవద్దని సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సురేశ్‌కు ఎలాంటి ప్రాణహాని లేదని తెలిపారు. పులి మనుషులపై ఎందుకు దాడి చేస్తుందో శాస్త్రీయంగా విశ్లేషిస్తామన్నారు. సీసీఎఫ్ శాంతారాం, జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో వేణుబాబు, ఎఫ్‌డీవో సర్వేశ్వర్, ఎఫ్ఆర్‌వో రత్నాకర్ ఉన్నారు.

విజయోత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం


- కలెక్టర్ రాజర్షిషా



విద్యార్థిని సన్మానిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్: ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం కప్–2024 టూకే, ఎయిడ్స్ డే ర్యాలీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విజయోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి డిసెంబర్ 9వరకు ఒక్కోరోజు ఒక్కో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. రెసిడెన్షియల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. సాంస్కృతిక సారథి కళాకారులు 114 పంచాయతీల పరిధిలో సంక్షేమ పథకాలపై కళాజాత నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం ఇటీవల జాతీయస్థాయి ఎస్జీఎఫ్ జూడో పోటీల్లో కాంస్య పతకం సాధించిన ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థి హర్షవర్ధన్‌ను సన్మానించారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సారథి కళాకారులతో రూపొందించిన ప్రజాపాలన ఆడియో సాంగ్‌ను ఆవిష్కరించారు. డీపీఆర్వో తిరుమల, డీవైఎస్వో వెంకటేశ్వర్లు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వద్ద అవగాహన ర్యాలీని కలెక్టర్ రాజర్షిషా ప్రారంభించారు. ప్రధాన వీధుల గుండా డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో నరేందర్ రాథోడ్ మాట్లాడారు. ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపవద్దని తెలిపారు. అనుమానితులు రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఏఆర్టీ సెంటర్ల ద్వారా వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అవగాహనతోనే హెచ్ఐవీ/ఎయిడ్స్‌ను నిర్మూలించవచ్చని చెప్పారు. సమావేశంలో జిల్లా ఎయిడ్స్, లెప్రసీ నివారణాధికారి గజానంద్, డీఐవో వైసీ శ్రీనివాస్, రిమ్స్ గైనకాలజిస్ట్ కౌస్తుబా, డీపీఎంవో నాగరాజ్, మాస్ మీడియా అధికారి వెంకటరెడ్డి, ఆదిల్ ఆదర్శ పాజిటివ్ సొసైటీ అధ్యక్షురాలు సరిత, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి నిరాకరణ

ఆదిలాబాద్‌రూరల్: 'గురుకుల బాట'లో భాగంగా ఆదివారం మావల మండలంలోని జాతీయ రహదారి సమీపంలోగల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాల సందర్శనకు వెళ్లిన బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫరేజ్, ఇతర నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఎస్సై విష్ణువర్ధన్ సిబ్బందితో కలిసి లోనికి వెళ్లకుండా గేటు వద్దే ఆపి అనుమతి లేదని చెప్పారు. దీంతో నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం ఫరేజ్‌ను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నాయకులను గేటు వద్ద అడ్డుకుంటున్న పోలీసులు



కుష్ఠుపై సమరం

- నేటి నుంచి జిల్లాలో సర్వే
- అనుమానితులకు పరీక్షలు
- జిల్లాలో 58మంది బాధితులు

జిల్లాలో వ్యాధిగ్రస్తుల వివరాలు

సంవత్సరం	వ్యాధిగ్రస్తులు
2017–18	122
2018–19	85
2019–20	84
2020–21	41
2021–22	58
2022–23	62
2023–24	70
2024–25 (నవంబర్ వరకు)	58



ఆదిలాబాద్‌టౌన్: కుష్ఠు నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఏడాదిలో రెండుసార్లు సర్వే నిర్వహిస్తోంది. గత మార్చిలో సర్వే చేపట్టగా, ఈనెల 2 నుంచి 15వ తేదీ వరకు మళ్లీ ప్రక్రియ చేపట్టనుంది. ఉదయం 6.30 నుంచి 9.30 గంటల వరకు ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి అనుమానితులకు పీహెచ్‌సీల్లో పరీక్షలు చేయిస్తారు. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు.

సర్వేకు సిబ్బంది నియామకం

జిల్లాలో 22 పీహెచ్‌సీలు, ఐదు పట్టణ ఆరోగ్యకేంద్రాలున్నాయి. జిల్లాలో 8.27లక్షల జనాభా ఉన్నట్లు వైద్యశాఖ అంచనా వేసింది. జిల్లాలో 1,68,238 నివాసాలున్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 1.40లక్షలకు పైగా, పట్టణ ప్రాంతాల్లో 28వేల వరకు ఉన్నాయి. కుష్ఠు సర్వేకు 1,002 మంది ఆశ కార్యకర్తలు, పర్యవేక్షణకు 200మంది సూపర్‌వైజర్లను నియమించారు. గ్రామీణ ప్రాంతాల్లో 915 మంది ఆశాకార్యకర్తలు, పట్టణ ప్రాంతాల్లో 87మంది సర్వే నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో 183, పట్టణ ప్రాంతాల్లో 17 బృందాలు పర్యవేక్షిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో 20, పట్టణ ప్రాంతాల్లో 25 చొప్పున ఇళ్ల సర్వే చేపట్టనున్నారు. ఇదివరకు నిర్వహించిన సర్వే డబ్బులు ఇవ్వకపోవడంతో ఈసారి ప్రక్రియ చేపట్టబోమని ఆశ కార్యకర్తలు డీఎంహెచ్‌వోను కలిసి ఇటీవల వినతిపత్రం ఇచ్చారు.

పరీక్షలకు ముందుకురాని జనాలు

ప్రస్తుతం జిల్లాలో 58 మంది వ్యాధిగ్రస్తులున్నారు. అవగాహన లేకుండా, వ్యాధిని ఆరు నెలల్లోపు గుర్తించకుంటే తీవ్రత పెరిగి బాధితులు వైకల్యం బారిన పడతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అంకోలి పీహెచ్‌సీ పరిధిలో అత్యధికంగా 10 మంది వ్యాధిగ్రస్తులుండగా, బేల పీహెచ్‌సీ పరిధిలో ఐదుగురు, గుడిహత్నూర్, భీంపూర్, తలమడుగు, దండేపల్లి పరిధిలో నలుగురు చొప్పున, ఇంద్రవెల్లి, సైద్‌పూర్, తాంసి, బజార్‌హత్నూర్ పరిధిలో ముగ్గురు చొప్పున, ఇచ్చోడ, నర్సాపూర్(టి), శ్యామ్‌పూర్, ఝరి పీహెచ్‌సీల పరిధిలో ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని అర్బన్ పీహెచ్‌సీలో శాంతినగర్, పుత్లీబౌళి, ఖుర్షీద్‌నగర్‌లో ఒక్కొక్కరు చొప్పున, చిల్కూరిలక్ష్మీనగర్‌లో ముగ్గురు వ్యాధిగ్రస్తులున్నారు. జిల్లా వ్యాప్తంగా 58 మంది బాధితులున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సర్వేకు సహకరించాలి




ఈనెల 2నుంచి 15వరకు ఇంటింటి సర్వే చేపడుతున్నాం. ఆశ కార్యకర్తలు కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి అనుమానితులను పీహెచ్‌సీలకు తీసుకెళ్లి పరీక్షలు చేయిస్తారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలుంటే పరీక్షలు చేయించుకోవాలి. కుష్ఠు అంటువ్యాధి కావడంతో దీని నిర్మూలనకు అంతా సహకరించాలి.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నిర్వహించిన ప్రథమ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఎనిమిది నెలల క్రితం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సిఫారసుల మేరకు స్పౌజ్, మెడికల్ గ్రౌండ్, మ్యూచువల్ బదిలీలు మాత్రమే చేయాలని నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 243, 244, 245తో ఎలాంటి ప్రయోజనం లేదని తెలిపారు. సీఎం ప్రత్యేక చొరవ తీసుకుని వీరిని సొంత జిల్లాలకు తీసుకురావాలని కోరారు. స్పౌజ్ విషయంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులనూ పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గంలో ఉపాధ్యక్షురాలిగా సుజాత, సంయుక్త కార్యదర్శులుగా గంగినేని రామారావు, గంద్రత్ నారాయణ, భీమ్రావు, కార్యదర్శులుగా రాజేశ్వర్, అరుణ, ఆడిట్ కమిటీ సభ్యుడిగా యాదగిరి, అధ్యక్షుడిగా తుమ్మల లచ్చిరాంకు చోటు లభించగా వీరిని శాలువాలతో సన్మానించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు జాదవ్ బలిరామ్, కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరాం

క్లుప్తంగా

టిప్పర్ ఢీకొని 12 గొర్రెలు మృతి

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రి గ్రామంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఆదివారం టిప్పర్ ఢీకొని 12 గొర్రెలు మృతిచెందాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. రైతు పెద్ది మల్లేశ్‌యాదవ్‌కు చెందిన గొర్రెల మంద రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొంది. డ్రైవర్ మద్యంమత్తులో అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో ప్రమాదం చోటుచేసుకుంది.

కాలువలో పడిన దుప్పి



అటవీ అధికారులు కాపాడిన దుప్పి

వాంకిడి: మండలంలోని చిన్న వాంకిడి సమీపంలో కుమురం భీం ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువలో ఆదివారం దుప్పి ప్రమాదవశాత్తు పడింది. స్థానికులు గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. డిప్యూటీ రేంజర్ ఝాన్సీ లక్ష్మి, బీట్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తాళ్ల సాయంతో దుప్పిని బయటికి తీసి కాపాడారు. ఎఫ్‌ఆర్వో గోవింద్ చంద్ సర్దార్ ఆదేశాల మేరకు దుప్పిని అటవీ ప్రాంతానికి తరలించినట్లు వారు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రెబ్బెన: మండలంలోని గోలేటి పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో బోయిన మల్లేశ్ ఇల్లు దగ్ధమైంది. మంటలు చెలరేగి వ్యాపించగా కేకలు వేయగా స్థానికులు బిందెలు, బకెట్లతో నీళ్లు పోసి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ఇంటి పైకప్పు కలపతో గూనపెంకులు, రెండు సెల్‌ఫోన్లు, టీవీ, కూలర్‌తోపాటు రూ.10వేల నగదు కాలిబూడిదయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ.50వేల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

టాటామ్యాజిక్ ఢీకొని రైతు మృతి

జైనూర్: టాటామ్యాజిక్ ఢీకొని రైతు మృతి చెందాడు. ఎస్సై సాగర్ కథనం ప్రకారం.. మండలంలోని రాసిమెట్ట గ్రామానికి చెందిన రైతు మెస్రం జైవంత్‌రావు(47) ఎడ్లను మేతకు తీసుకెళ్లి ఆదివారం రాత్రి తాడును వదులుతుండగా ఆసిఫాబాద్ నుంచి జైనూర్ వైపు వస్తున్న టాటామ్యాజిక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కొడుకు రాము ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

కల్వర్టుకు ఢీకొని ఒకరు..

బాసర: మండలం బిద్రెల్లి సరిహద్దు గల మహారాష్ట్ర ధర్మాబాద్ ప్రధాన రోడ్డులో కల్వర్టు ఢీకొని ఒకరు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..ముధోల్‌లోని బట్టిగల్లీకి చెందిన గైక్వాడ్ లక్ష్మణ్ పీరాజి బైక్‌పై పని నిమిత్తం ఆదివారం ధర్మాబాద్ బయల్దేరి వెళ్లాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో కల్వర్టును ఢీకొని మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ధర్మాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆలయంలో కంకలమ్మ దేవి అమ్మవారు



కొబ్బరికాయలతో మొక్కులు..



తల్లి దీవించు..



కరుణించు తల్లీ

- ఘనంగా కంకలమ్మ మహా జాతర
- తరలివచ్చిన భక్తులు
- అమ్మవారికి పూజలు..మొక్కులు

కౌటాల: మండలకేంద్రంలోని కంకలమ్మ గుట్ట(మేదరిగిరి)పై ఉన్న కంకలమ్మ- కేతేశ్వరస్వామి ఆలయ 20వ మహా జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా కార్తిక మాసం ఆఖరు ఆదివారం నిర్వహించే ఈ జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాక తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి వేలాది భక్తులు తరలివచ్చారు. ఆలయంలో పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్‌ను సన్మానించారు.

జనసంద్రంగా గుట్ట



కలెక్టర్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ సభ్యులు

కంకలమ్మ గుట్ట భక్తులతో జనసంద్రంగా మారింది. సమీప గ్రామాల ప్రాంతాల ప్రజలు జాతరకు ఎడ్లబండ్లపై తరలివచ్చారు. పూజల అనంతరం కుటుంబ సమేతంగా వనభోజనాలు చేశారు. కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో ప్రజలు వస్తువులు కొనుగోలు చేసి సందడి చేశారు. మేదరి సంఘం ఆధ్వర్యంలో బొంగులతో తయారు చేసిన వస్తువులను విక్రయించారు.



వెదురు వస్తువులు కొనుగోలు చేస్తూ..

మహా అన్నదానం..

కంకలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, కౌటాల ఆర్‌ఎంపీల సంఘం ఆధ్వర్యంలో తాగునీటిని పంపిణీ చేశారు. కంకలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు వానుపటేల్, జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, ఆలయ అధ్యక్షుడు ఉప్పుల సత్తయ్య, మహిళా కమిటీ అధ్యక్షురాలు సుల్వ కళ్యాణమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జనసంద్రంగా కంకలమ్మ గుట్ట



కంకలమ్మ గుట్టపైకి.. మెట్ల దారిలో



వస్తువులు కొనుగోలు చేస్తున్న యువతులు

కొమురయ్యను బతికించండి



సాయం కోసం ఎదురుచూస్తున్న కుటుంబం



మంచానికే పరిమితమైన కొమురయ్య

- పెద్దపేగుకు రంధ్రం పడి ఏడాదిగా నరకయాతన
- రూ.4 లక్షలు అప్పు చేసి ఆపరేషన్
- అయినా నయం కాని వ్యాధి
- మందులకు చిల్లిగవ్వ లేని దుస్థితి
- దాతల సాయం కోసం ఎదురుచూపు

కడెం/దస్తురాబాద్: రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబానికి పెద్ద కష్టమొచ్చింది. పెద్దపేగుకు రంధ్రం పడి నరకయాతన పడుతున్నాడు. లక్షల రూపాయలు అప్పు చేసి ఆపరేషన్ చేయించినా నయం కాలేదు. మందులకు డబ్బులు లేక దాతల సాయం కోసం బాధిత కుటుంబం ఎదురుచూస్తోంది. దస్తురాబాద్ మండలం రేవోజీపేట్ గ్రామానికి చెందిన బుర్రవేని కొమురయ్య-కళవ్వ దంపతులకు ముగ్గురు కుమారులు. గ్రామంలో ఉన్న 20 గుంటల భూమిని సాగు చేసుకుంటూ, గొర్రెల కాపరిగా జీతం ఉండి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఉన్నదాంట్లో సాఫీగా సాగుతున్న ఆ పేద కుటుంబానికి కష్టమొచ్చింది. కొమురయ్యకు పెద్దపేగుకు రంధ్రం పడి అనారోగ్యం బారినపడ్డాడు. అయినా కాపరిగా పనిచేసుకుంటూ ఏడాదిగా కుటుంబాన్ని నెట్టుకొచ్చాడు. ఇటీవల అనారోగ్యం తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు చేసిన వైద్యులు ఆపరేషన్‌కు రూ.4 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. చేతిలో చిల్లిగవ్వ లేదు.. ఎలాగైనా భర్తను బతికించుకోవాలని భార్య అప్పు చేసి ఇటీవల ఆపరేషన్ చేయించింది. కొన్నినెలలు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. భర్తకు సపర్యాలు చేస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. అయితే పేగుకు చీము రావడంతో ప్రతి పదిహేను రోజులకోసారి శుభ్రం చేయాల్సి వస్తుంది. దీనికి రూ.15 వేలు ఖర్చవుతుంది. మందులు, వైద్యఖర్చులకు ప్రతినెల రూ.40 వేల ఖర్చులు అవుతుందని దాతలు సాయం చేయాలని వేడుకుంటుంది. బుర్రవేని కళవ్వ, ఫోన్ పే, గూగుల్ పే ఫోన్ నంబర్: 62814 85692 సాయం చేసి ఆదుకోవాలి.

అక్రమంగా లక్క తరలిస్తున్న వాహనం పట్టివేత

- ఆరుగురిపై కేసు

వేమనపల్లి: కుమురంభీం-మంచిర్యాల జిల్లాల సరిహద్దు అడవుల్లో లక్క అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. రాంపూర్, క్లాంపల్లి అడవుల్లో లక్క కోసం వేలాది తిరుమాను, బొజ్జ చెట్లను నరికి స్థానికులతో సేకరిస్తున్నారు. అక్కడి నుంచి ఛత్తీస్‌ఘడ్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో వేమనపల్లి డీఆర్వో రూపేష్, ఎఫ్ఎస్ఓ బేగ్ సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం క్లాంపల్లి వద్ద మాటు వేసి పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్వో దయాకర్ తెలిపారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం భూపాలపట్నం చెందిన జన్న వెంకటేశ్వర్లు, పవనూరి సత్యనారాయణ, దుర్గం సత్యనారాయణ, చెన్నూర్‌కు చెందిన దిండు చిరంజీవి, కోటపల్లికి చెందిన శైలేశ్వరం మహేశ్, దహెగాం మండలం రాంపూర్‌కు చెందిన చెడ్మెత సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్వో తెలిపారు. ఇందులో చెడ్మెత సుధాకర్ పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. క్వింటాల్ లక్కతోపాటు బొలెరో వాహనం, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకుని కుశ్నపల్లి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.



నిందితులతో అటవీ అధికారులు

చిన్నారి వైద్యానికి రూ.1.26 లక్షలు అందజేత

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలటౌన్: పట్టణానికి చెందిన గడెవార్ గజానన్-రూప దంపతుల కుమార్తె జాగృతి (9) బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతోంది. వైద్యం ఖరీదు కావడంతో లక్షల్లో ఖర్చవుతుంది. అక్టోబర్ 20న 'ఈ పాపను కాపాడరూ'..శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ రూ.1.26 లక్షల విరాళాలు సేకరించి ఆదివారం అందించారు. సాక్షిలో వచ్చిన కథనాన్ని ఫేస్‌బుక్‌లో పోస్టు చేయగా, పలువురు దాతలు స్పందించి తండ్రి గజానన్ బ్యాంకు ఖాతాకు రూ.1.26 లక్షల విరాళాన్ని అందించారని రమేశ్ తెలిపారు. ఎస్బీఐ మేనేజర్ శ్రీకాంత్ ఆయనకు చెక్కు అందించారు.



నగదు అందిస్తున్న రేణికుంట రమేశ్

పంటచేనులో సీసీ కెమెరా

- చోరీల నివారణకు యువ రైతు వినూత్న ఆలోచన

తాంసి: మండలంలోని జామిడి గ్రామానికి చెందిన యువరైతు చేనులో సామగ్రి చోరీకి గురవుతోంది. దీంతో యువరైతు గడ్డం నిఖిల్‌రెడ్డి వినూత్నంగా ఆలోచించాడు. తన పంట చేనులో గతేడాది సీసీ కెమెరా ఏర్పాటు చేసుకున్నాడు. సోలార్‌తో నడిచే సీసీ కెమెరాను ఆన్‌లైన్‌లో రూ.13 వేలు వెచ్చించి కొనుగోలు చేశాడు. దీనికి సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసుకుని చేనులో పంటను పరిశీలించి కూలీలతో పనులు చేయిస్తున్నాడు. సీసీ కెమెరా ఏర్పాటుతో చేలలోకి ఎవరైనా చొరబడినా, అడవి జంతువులు వస్తే వెంటనే సెల్‌ఫోన్‌కు అలర్ట్ మెసేజ్ వస్తుందని యువ రైతు తెలిపాడు.



సీసీ కెమెరా వద్ద యువ రైతు నిఖిల్‌రెడ్డి

బహ్రెయిన్‌లో సారంగపూర్ వాసి మృతి

- మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేలా ఏర్పాట్లు



కల్లూరి వెంకటేశ్ (ఫైల్)

సారంగపూర్: బహ్రెయిన్‌లో మండల కేంద్రానికి చెందిన కల్లూరి వెంకటేశ్ గతనెల 24న బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందాడు. కుటుంబసభ్యులు, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు స్వదేశ్ పరికిండ్ల తెలిపిన వివరాలు.. వెంకటేశ్ కూలీ పని నిమిత్తం మూడేళ్ల క్రితం బహ్రెయిన్ వెళ్లి ఉపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో స్వగ్రామానికి తిరిగి రావడానికి ఏర్పాట్లు చేసుకుంటుండగా గతనెల 22న అనారోగ్యం బారినపడ్డాడు. అక్కడే ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బ్రెయిన్ స్ట్రోక్ గురై మృతిచెందాడు. ఈ విషయాన్ని ఆయన బంధువులు ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్‌కు వివరించారు. వారు ఇండియన్ ఎంబసీకి అక్కడి నుంచి బహ్రెయిన్‌కు మాదద్ పోర్టల్ ద్వారా సమాచారం అందించారు. అక్కడి సామాజిక కార్యకర్తలు నోముల మురళీ, విద్యాసాగర్, శేక్ అహ్మద్‌లు మృతదేహాన్ని స్వగ్రామానికి పంపేలా ఏర్పాట్లు చేపట్టారు. హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న తర్వాత సారంగాపూర్ తరలించేందుకు సీఎం కార్యాలయ ప్రత్యేకాధికారి చిట్టిబాబు ఏర్పాట్లు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

వాంకిడి: మండల కేంద్రంలోని ఎస్బీఐ ఏటీఎంలో శనివారం అర్ధరాత్రి దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. ఏటీఎంలో చొరబడి సుత్తి, రాడ్లతో పగులగొట్టేందుకు యత్నించారు. ఈక్రమంలో అలారం మోగడంతో వారు పారిపోయారు. సంఘటన స్థలాన్ని పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో నందిగామకు చెందిన బండ్ల అబ్రహం, విజయవాడకు చెందిన తుమ్మల మధును అదుపులో తీసుకుని కేసు నమోదు చేశారు. వీరు లారీలో మహారాష్ట్ర వైపు నుంచి వచ్చారని పేర్కొన్నారు.



సీసీ ఫుటేజ్‌లో మిషన్ పగులగొట్టేందుకు యత్నిస్తున్న దుండగుడు

మేకల మందపై పులి దాడి!



పులి దాడిలో మృతి చెందిన మేక



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని దానాపూర్ సమీపంలో ఆదివారం మేకల మందపై పులి దాడి చేసింది. కాపరి గమనించి పరుగులు తీసి గ్రామస్తులకు విషయం చెప్పాడు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు అక్కడికి వెళ్లగా ఎనిమిది మేకలకు గాను ఒక మేక చనిపోయి ఉంది. మరో మేక గాయపడి, ఇంకొక మేక కనిపించకుండా పోయింది. ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ సింగ్ సర్దార్ డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, బీట్ అధికారులు రాజేష్, సాధిక్, వెంకటేశ్ ఘటనస్థలాన్ని పరిశీలించారు. దాదాపు నాలుగు గంటలపాటు అటవీ ప్రాంతంలో తిరిగిన వారికి ఆనవాళ్లు కనిపించకపోవడంతో స్పష్టతకు రాలేదు. అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పులి అవునా కాదా అనే విషయం తెలియడానికి సమయం పడుతుందని తెలిపారు.

మట్కా నిందితుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో మట్కా ఆడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై సయ్యద్ ఇసాఖ్ అలీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని బొక్కల్‌గూడకు చెందిన బబ్లు ఖాన్ సాత్నాల బస్టాండ్ ప్రాంతంలో మట్కా ఆడుతుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అయన వద్ద నుంచి రూ.2100 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



అనిల్ (ఫైల్)

తాండూర్: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధి రాజీవ్‌నగర్‌కు చెందిన వరాల అనిల్ మాదారం టౌన్‌షిప్‌నకు చెందిన యువతితో వివాహమైంది. కొన్ని నెలల నుంచి కుటుంబ కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అనిల్ తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పశువులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

లింగాపూర్: మండలంలోని ఏల్లాపటార్ గ్రామంలో అక్రమంగా పశువులను తరలిస్తున్న డీసీఎం వ్యాన్‌ను పట్టుకున్నట్లు ఏఎస్సై తులసీరాం తెలిపారు. ఆదివారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఏఎస్సై.. డీసీఎం వ్యాన్ తనిఖీ చేయగా రెండు ఎడ్లు, రెండు దూడలు లభ్యమయ్యాయి. వీటిని తరలిస్తున్న సంజీవ్, గోర్లే కిషన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగన్న తెలిపారు. పశువులను నార్నూర్ గోశాలకు తరలించామన్నారు.

చిరుత దాడిలో ఎద్దు మృతి

బజార్‌హత్నూర్: మండలంలోని బుర్కపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి ఎద్దుపై చిరుతపులి దాడి చేసి చంపి తిన్నది. ఎఫ్ఆర్వో పుండలిక్ తెలిపిన వివరాల ప్రకారం.. బరంపూర్ ఫారెస్ట్ బీట్ పరిధిలోని బుర్కపల్లి గ్రామానికి చెందిన సిడం నాందేవ్‌కు చెందిన ఎద్దుపై చిరుత పులి దాడి చేసి చంపింది. పశుగ్రాసం కోసం వెళ్లిన పశువుల్లోని ఒక ఎద్దు రాత్రి వరకు రాలేదు. ఉదయం దాని ఆచూకీ కోసం వెతకగా అటవీ ప్రాంతంలో చిరుత దాడిలో మృతి చెందిన ఎద్దు కళేబరాన్ని గుర్తించారు. సమాచారం ఇవ్వడంతో అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని చిరుతపులిగా నిర్ధారించారు. రైతులు తమ పశువులను అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లవద్దని, పంట చేన్లలో కరెంట్ తీగలు పెట్టద్దని సూచించారు.



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

యువతి మౌన పోరాటం

భీమిని: ప్రేమించి పెళ్లికి నిరాకరించిన ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు మౌన పోరాటానికి దిగింది. భీమిని మండలం వెంకటాపూర్‌లో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది.. కన్నెపల్లి మండలం ఐదపల్లికి చెందిన యువతి భీమిని మండలం వెంకటాపూర్‌కు చెందిన పుట్ట శ్రీకాంత్ రెండేళ్లుగా ప్రేమించుకున్నారు. పెళ్లి నిరాకరించడంతో గతనెల ప్రియుడి ఇంటి ఎదుట ధర్నా చేపట్టింది. దీంతో పోలీసులు, సఖీ కేంద్రం నిర్వాహకులు ఇరు కుటుంబాల సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం పెద్దల సమక్షంలో పంచాయితీ చేశారు. అయినా యువతికి న్యాయం జరగకపోవడంతో మౌనపోరాటానికి దిగింది. తనకు న్యాయం జరిగేవరకు మౌన పోరాటం చేస్తానని బాధిత యువతి తెలిపింది.



మౌన పోరాటం చేస్తున్న యువతి

అ'పూర్వ' కలయిక



మందమర్రిరూరల్: సరస్వతి శిశుమందిర్ పాఠశాల పూర్వ విద్యార్థులు

మందమర్రిరూరల్: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల 2001-02 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వీరి అపూర్వ కలయికకు పాఠశాల వేదికైంది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు.



కాసిపేటలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

కాసిపేట జెడ్పీ పాఠశాలలో..

కాసిపేట: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 2001-02 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. అపూర్వ సమ్మేళన కార్యక్రమానికి హాజరై ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. యోగాక్షేమాలను అడిగి తెలుసుకుని చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.